క్లుప్తంగా

కొనసాగుతున్న సర్వే



మల్హర్ : మండలంలోని మల్లారం గ్రామంలో ఇంటింటా మిషన్ భగీరథ సర్వే శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యదర్శి రాజు ఇంటింటికి వెళ్లి వారి వివరాలు, మిషన్ భగీరథ కనెక్షన్ ఉందా? వచ్చే నీరు సరిపోతున్నాయా? నీరు ఏవిధంగా వస్తున్నాయి? అనే వివరాలను గ్రామస్తులను అడిగి తెలుసుకొని యాప్‌లో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ అజ్మీరా దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

వృథాగా 'మిషన్ భగీరథ'



రేగొండ : మండలంలోని రంగయ్యపల్లి శివారులో పోచంపల్లికి వెళ్లే దారిలో మిషన్ భగీరథ పథకంలో భాగంగా వేసిన తాగునీటి పైపు నుంచి నీరు వృథాగా పోతున్నాయి. నీటి వృథాను అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ లీకేజీలను గుర్తించి, తాగు నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భూపాలపల్లి రూరల్: 11కేవీ లైన్ మరమ్మతుల నేపథ్యంలో నేడు (ఆదివారం) భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ విశ్వాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7:30గంటల నుంచి ఉదయం 11:30గంటల వరకు జవహర్ నగర్, 5 ఇంక్లైన్, మైసమ్మ కాలనీ, పుట్టూరు రామయ్యపల్లి, మంజూరునగర్, బీసీ కాలనీ, జీఎంఆర్ వెంచర్, వెంగళరావు వెంచర్, కుందూరుపల్లి ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

పండ్ల పంపిణీ



చిట్యాల : ఉత్తమ అవార్డు గ్రహీత, దివంగత మాజీ సర్పంచ్ డాక్టర్ మాసు రాజయ్య జన్మదిన వేడుకలను శనివారం మండల కేంద్రంలో నిర్వహించారు. అనంతరం మాసు రాజయ్య చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు మాసు రమేష్ ఆధ్వర్యంలో సివిల్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు, స్నేహితులు, తదితరులు పాల్గొన్నారు. కాగా రాజయ్య గత కొన్నేళ్ల క్రితం మృతి చెందగా, అతడి చిన్న కుమారుడు రాకేష్ నాన్న ప్రేమకు గుర్తుగా చేతిపై తన తండ్రి ఫొటోను పచ్చబొట్టు పొడిపించుకుని ప్రేమను చాటుకున్నాడు.

పిచ్చికుక్క దాడిలో ఇద్దరికి గాయాలు

● ఆరు గేదెలపై కూడా..



వాజేడు : పిచ్చికుక్క దాడిలో ఇద్దరికి గాయాలు కాగా ఆరు గేదెలపై సైతం దాడి చేసి గాయపర్చిన ఘటన శనివారం జరిగింది. మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో ముత్తెబోయిన సత్యమ్మ, గగ్గురి రఘుబాబులపై పిచ్చికుక్క దాడి చేసి కరిచింది. అంతకు ముందు పాయబాటలు గ్రామంలో ఆరు గేదెలను కరిచి గాయపరిచినట్లు గ్రామస్తులు తెలిపారు.

గుండెపోటుతో రైతు మృతి



అప్పిరెడ్డి (ఫైల్)

మంగపేట : మండలంలోని రాజుపేట గ్రామానికి చెందిన రైతు అనుముల అప్పిరెడ్డి(45) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు కథనం ప్రకారం.. అప్పిరెడ్డి శనివారం ఉదయం పొలంలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నేందుకు వెళ్లి ఇంటికి వచ్చాడు. అనంతరం కొద్దిసేపటికే గుండెపోటు రావడంతో మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఆర్ఎస్ జిల్లా నాయకులు తుమ్మ మల్లారెడ్డి, రెడ్డి సంఘం నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మృతుడికి భార్య రాణి, కుమారుడు, కూతురు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



టేకుమట్ల : విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న జెడ్పీటీసీ, ఉపాధ్యాయులు

మొగుళ్లపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని జెడ్పీటీసీ జోరుక సదయ్య అన్నారు. బాడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు విజయపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జోరుక సదయ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ హుస్సేన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యతో పాటు అన్ని వసతులు, ఉన్నత విలువలతో కూడిన విద్యను అందుతున్నారు. ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. ప్రైవేట్ పాఠశాలల కంటే ఉత్తమ ఫలితాలు ప్రభుత్వ పాఠశాలలోని వస్తున్నాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

టేకుమట్ల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం ఉపాధ్యాయ బృందం, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందజేశారు. అనంతరం జెడ్పీటీసీ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత పాఠ్య పుస్తకాలతో పాటు, మధ్యాహ్న భోజనం, యూనిఫాం అందిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నత విద్య అందిస్తారని అన్నారు. సువిశాల పాఠశాల ప్రాంగణంలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, ఉపాధ్యాయులు ప్రకాశ్, సదయ్య, ఆనంద్, కవిత, పంకజ, అంకూస్, అనిత, వింధ్యారాణి, రంగారెడ్డి, మోజెస్, రహీమున్నీషా పాల్గొన్నారు.



మొగుళ్లపల్లి: పుస్తకాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించండి



వెంకటాపురం(కె): కరపత్రం ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

వెంకటాపురం(కె) : తల్లిదండ్రులు తమ పిల్లలను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్ కోరారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల ప్రచార కరపత్రాన్ని శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వారు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేసిన కళాశాలకు అవసరమైన ఏర్పాట్లు అందించేందుకు సిద్ధంగా ఉంటానని తెలిపారు.కళాశాల అకడమిక్ ఇన్‌చార్జ్ అమ్మిన శ్రీనివాసరాజు, డీటీ మహేందర్, రెవెన్యూ సిబ్బంది సమ్మయ్య, మల్లయ్య, నాయకులు నాగేశ్వరావు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



మంగపేట: నగదు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

మంగపేట : మండల పరిధిలోని పొదుమూరుకు చెందిన నిరుపేద అబ్బాస్ కుటుంబానికి దాతల ద్వారా సేకరించిన రూ.5,000 నగదును జ్వాలా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కోడెల నరేష్ ఆధ్వర్యంలో శనివారం బాధిత కుటుంబానికి అందజేశారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తు కుటుంబాన్ని పోషిస్తున్న ఇంటి యజమాని అబ్బాస్ పెరాల్సిస్‌తో మంచానికే పరిమితమయ్యాడు. అప్పటి నుంచి అబ్బాస్ భార్య రెహానా భర్త బాగోగులు చూసుకుంటు ముగ్గురు పిల్లలను పోషించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతుంది. ఈదురు గాలికి వారు నివాసిస్తున్న ఇల్లు సైతం ఇటీవల కూలి నేలమట్టం కావడంతో నిలువ నీడలేక ప్రస్తుతం ఇతరుల ఇంట్లో తల దాచుకుంటున్నారు. అబ్బాస్ కుటుంబ పరిస్థితిని చూసి చలించిన స్థానికులు విషయాన్ని జ్వాలా చారిటబల్ ట్రస్ట్ దృష్టికి తీసుకువచ్చారు. నిరుపేద కుటుంబాన్ని ఆదుకునేందుకు తమ వంతుగా ట్రస్ట్ నిర్వాహకులు దాతల నుంచి రూ.5,000 నగదును సేకరించి బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు రాకేష్, ముకుందం, సయ్యద్‌బాబా, ఆదినారాయణ పాల్గొన్నారు.



ఎస్ఎస్‌తాడ్వాయి : ఆర్థికసాయం అందజేస్తున్న గ్రామస్తులు

ఆర్థికసాయం

ఎస్ఎస్‌తాడ్వాయి : కర్నాటక రాష్ట్రంలోని నిట్ కళాశాలలో ఎంటెక్ సీటు సాధించిన మండలంలోని జంగవాయి(కొత్తూరు) గ్రామానికి చెందిన అనుముల శ్రీకాంత్‌కు ఊరట్టం గ్రామస్తులు శనివారం రూ.5వేల నగదు అందజేశారు. ఈనెల 14న సాక్షిలో ప్రచురితమైన కథనంపై స్పందించిన గ్రామస్తులు పేదింటి విద్యార్థి శ్రీకాంత్‌ను శాలువాతో సన్మానించి ఆర్థికసాయం అందజేసి, అభినందించారు.అలాగే దాతలు ముందుకు వచ్చి ఆర్థికసాయం అందించాలని కోరారు.కార్యక్రమంలో కడారి స్వామి, దేవులపల్లి రాజయ్య, పోలెబోయిన రాంబాబు, చర్పా నేతాజీ, చర్పా రవి, జాలిగపు జంపన్న, మూల సతీష్, వీరెల్లి శశధర్ రెడ్డి, రంగారపు శ్రీను, కుర్రి భాస్కర్‌రెడ్డి, దేవులపల్లి వెంకన్న పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను వీడాలి



అవగాహన కల్పిస్తున్న సూర్యనారాయణ

వెంకటాపురం(కె) : దినదినం సాంకేతిక రంగంలో ఎంతో అభివృద్ధి చెందుతున్న నేటి సమాజంలో ఇంకా మూఢనమ్మకాలను నమ్మవద్దని స్థానిక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఈ మేరకు మండల పరిధిలోని సుడిబాక గ్రామంలో శనివారం కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మూఢనమ్మకాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పాఠశాల ఉపాధ్యాయుడు సూర్యనారాయణ మూఢనమ్మకాల వల్ల కలిగే ఇబ్బందులను వివరించారు. మూఢనమ్మకాలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్ గొంది హనుమంతు, వాజేడు కోఆర్డినేటర్ కామేష్, ఉషారాణి, ఇందిర, నరేష్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

'కస్తూర్బా'లో చేరేందుకు క్యూ..



మంగపేట : ప్రభుత్వ పాఠశాల అనగానే చిన్న చూపు చూస్తున్న నేటి రోజుల్లో.. ఓ రెసిడెన్షియల్ విద్యాలయంలో మాత్రం అడ్మిషన్ దొరకడంలేదు. నాణ్యమైన విద్య, సకల సౌకర్యాలు, ప్రభుత్వం అందించే అన్ని వసతులు ఉండడంతో అడ్మిషన్ కోసం ఎగబడుతున్నారు. వివరాలు.. మండల కేంద్రంలో రూ.3.15 కోట్ల నిధులతో నూతనంగా నిర్మించిన కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ప్రారంభోత్సవానికి ముందే విద్యార్థుల నుంచి అడ్మిషన్లు వెల్లువెత్తడంతో నో అడ్మిషన్ బోర్డు పెట్టాల్సిన పరిస్థితి నెలకొందని మండల ఇన్‌చార్జ్ ఎంఈఓ లకావత్ రాజేశ్‌కుమార్ తెలిపారు. మండల విద్యావనరుల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంగ్లిష్ మీడియం రెసిడెన్షియల్ పాఠశాలకు సొంత భవనం లేకపోవడంతో 2017 నుంచి చుంచుపల్లి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో తాత్కాలికంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మొత్తం విద్యార్థుల సంఖ్య ప్రతి ఏడాది 52 నుంచి 100 మంది లోపు అడ్మిషన్ పొందేవారన్నారు. పాఠశాలలో 180 నుంచి 200 మంది విద్యార్థుల వరకు ఉండేవిధంగా ఏర్పాట్లు చేసి అడ్మిషన్లు స్వీకరించగా జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 282 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందారన్నారు. అలాగే రోజుకు 20 నుంచి 30 వరకు అడ్మిషన్ కావాలని వస్తున్నారన్నారు. పాఠశాల సామర్థ్యం మేరకు సీట్లు ఖాళీ లేక అడ్మిషన్ కోసం వచ్చే వారిని కాదనలేక ఫోన్ నంబర్ తీసుకుని ఇప్పటికే అడ్మిషన్ పొందిన వారిలో ఎవరైనా రానట్లయితే వారి స్థానంలో ఇతరులకు అడ్మిషన్ ఇచ్చేందుకు సమాచారం ఇస్తామని చెప్పి పంపిస్తున్నామన్నారు. గతేడాది వరకు అడ్మిషన్ పొందిన వారు 52 మంది, నూతనంగా మరో 230 మంది కొత్తగా వచ్చారన్నారు. దీంతో ప్రస్తుతం సీట్లు ఖాళీ లేక పోవడంతో నో అడ్మిషన్ బోర్డు పెటాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల పనితీరు, క్రమశిక్షణకు నిదర్శనంగా చెప్పుకోవచ్చన్నారు.

సాగు భూములకు హక్కు కల్పించాలి



దీక్షను ప్రారంభిస్తున్న సోమరాజు

వెంకటాపురం(కె) : ఎన్నో ఏళ్లుగా ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూములకు ప్రభుత్వం వెంటనే హక్కు కల్పించాలని తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు చింత సోమరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాయలం ఎదుట గొండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలని చేపట్టిన రిలే నిరహార దీక్షలు ఆరో రోజు అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ ఏజెన్సీలో ఆదివాసీల సాగు భూములకు రెవెన్యూ అధికారులు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూనెం సాయి, ప్రతాప్, మునేశ్వరావు, మనోజ్, రాజేష్ తదితరులు ఉన్నారు.

ఇసుక క్వారీ పనుల అడ్డగింత



లారీలను అడ్డుకున్న కొల్లూర్ రైతులు

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం పూస్కుపల్లి వద్ద చేపట్టిన కొల్లూర్–2 ఇసుక క్వారీని మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం కొల్లూర్ గ్రామానికి చెందిన రైతులు శనివారం అడ్డుకున్నారు. రైతులు తెలిపిన కథనం ప్రకారం నాలుగేళ్ల క్రితం కొల్లూర్–2 క్వారీ తవ్వకానికి ఏడుగురు రైతులకు చెందిన 19 ఎకరాల పంట భూములను ఇచ్చామన్నారు. ఒక్కో ఎకరానికి రూ.45వేల చొప్పున కౌలు చెల్లించేందుకు ఖరారు చేశారు. కాగా, ఈ ఏడాది కొల్లూర్–2 క్వారీలో ఇసుక లేదని, భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం పూస్కుపల్లి వద్దకు టీఎస్ఎండీసీ అధికారులు బదిలీ చేశారు. అక్కడి కాంట్రాక్టర్ రైతులకు నాలుగేళ్లుగా కౌలు డబ్బులు చెల్లించడం లేదని, తమ భూముల్లో ఇసుక కుప్పలు పోసి సేద్యానికి పనికి రాకుండా చేశారని తెలిపారు. నాలుగేళ్ల కౌలు నగదుతో పాటు భూమిని చదును చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో క్వారీల్లో లారీలను అడ్డుకుని, పనులు జరగకుండా వాగ్వాదం చేశారు. ఈ విషయంలో టీఎస్ఎండీసీ అధికారులు, కాంట్రాక్టర్లు ఎవరు స్పందించడం లేదని రైతులు ఆరోపించారు. మరోసారి పెద్ద ఎత్తున ధర్నాకు వస్తామని అక్కడి నుంచి వెళ్లిపోయారు. రైతులు పెంద్రి చంద్రశేఖర్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, జంగా తిరుపతిరెడ్డి, రాకేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఉత్తమ విద్యార్థులకు అభినందనలు



అధ్యాపకులతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



కలెక్టర్ కార్యాలయంలో భవేష్‌మిశ్రాతో..

చిట్యాల : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రశంసిస్తూ కళాశాల ప్రిన్సిపాల్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జిల్లా కలెక్టర్ భవేష్‌మిశ్రా వేర్వేరుగా అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ సెకండ్ ఇయర్‌లో జిల్లా టాపర్‌గా నిలిచిన యు.అజయ్ 978/1,000, ప్రథమ సంవత్సరంలో జిల్లా టాపర్‌గా నిలిచిన జి.మాధురి 463/470 మార్కులు సాధించడం పట్ల వారికి అభినందనలు తెలిపారు. బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. అలాగే విద్యార్థులకు చక్కగా పాఠాలు బోధిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లను ప్రశంసించారు. కార్యక్రమంలో డీఐఈఓ దేవరాజం,కళాశాల ప్రిన్సిపాల్ శరధృతి, అధ్యాపకులు బాలకృష్ణ, కర్ణాజీ, యుగేందర్, తిర్మలరావు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

కాటారం : సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో ఆరేళ్ల బాలికను అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని మాల మహానాడు ఉత్తర తెలంగాణ అధ్యక్షుడు పీక కిరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైస్‌మిల్లుల్లో తక్కువ వేతనాలకు ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకొచ్చి యజమాన్యాలు నిబంధనలను పాటించకపోవడం వల్ల ఇలాంటి అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. చిన్నారి కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని మిల్లు యజమానిపై కూడా చర్యలు తీసుకోవాలని కిరణ్ ఈ సందర్భంగా కోరారు

'పీసా'తో ఏజెన్సీ గ్రామాల అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

గోవిందరావుపేట : భారత రాజ్యాంగం ఐదో షెడ్యూల్డ్ ప్రాంతాలకు కల్పించిన పీసా చట్టం ఏజెన్సీ గ్రామాలకు రక్షణ కవచమని పీసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ అన్నారు. ఐటీడీఏ పీఓ ఏటూరునాగారం ఆదేశాల మేరకు శనివారం గోవిందరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పీసా అవగాహన సమావేశంలో కొమురం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే పీసా గ్రామసభలు బలోపేతం కావాలన్నారు. పీసా ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, మొబిలైజర్లు పీసా చట్టం పైన నిరంతరం పని చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది మడి సాయిబాబు, పీసా మండల అధ్యక్షుడు యుగేందర్, కల్తీ రమేష్, వట్టం సురేష్, 17 గ్రామ పంచాయతీల మొబిలైజర్లు, పీసా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో పటిష్ట భద్రత

● ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి



విరాళం అందజేస్తున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

ఎస్ఎస్ తాడ్వాయి : గ్రామాల్లో నిఘా నేత్రాలను (సీసీ కెమెరాలు)ఏర్పాటు చేసుకోవడం వల్ల ప్రజలకు పటిష్ట భద్రత ఉంటుందని స్థానిక ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని బయ్యక్కపేటలో కెమెరాల ఏర్పాటుపై గ్రామస్తులకు ఎస్సై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాలను నియంత్రించవచ్చని సూచించారు. అలాగే ప్రజలకు భద్రత కూడా ఉంటుందన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలని కోరారు. నిఘా నేత్రాల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలపై, ఛేదించిన కేసుల వివరాలను గ్రామస్తులకు వివరించి, ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.సీసీ కెమెరాల కమిటీకి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి రూ.2వేలు, కానిస్టేబల్, గ్రామ పోలీసు అధికారి సాంబయ్య, రూ. వెయ్యి విరాళంగా అందజేశారు. అనంతరం నార్లాపూర్ సమీపంలోని తక్కళ్లపాడు గొత్తికోయగూడేన్ని శ్రీకాంత్‌రెడ్డి సందర్శించారు. పిల్లలను పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులకు ఎస్సై కౌన్సిలింగ్ నిర్వహించారు.

అర్హులైన టీచర్లతో బోధన చేపట్టాలి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ములుగు రూరల్ : ప్రైవేట్ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులతో విద్యాబోధన చేపట్టాలని బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడు జక్కుల కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం మండల విద్యాశాఖ అధికారి సామల శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో యజమాన్యాలు పుస్తకాలు, యూనిఫాం అమ్మకాలు చేపడుతూ నిరుపేద విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అధిక ఫీజులు వసూలు చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. లేని పక్షంలో బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజేష్, ప్రవీణ్, ఉదయ్, నరేష్, ఫణి, సిద్ధు, కృష్ణ విక్రాంత్ తదితరులు పాల్గొన్నారు.

శోధక శక్తి వర్గం పోరాటంతోనే మార్పు



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న వెంకటేష్

● సీపీఎం రాష్ట్ర నాయకుడు వెంకటేష్

భూపాలపల్లి అర్బన్ : శోధక శక్తి వర్గం పోరాటంతోనే సమాజంలో మార్పు సాధ్యమని, మార్క్సిద్ధాంతమే సకల సమస్యల పరిష్కారానికి మార్గమని సీపీఎం రాష్ట్ర నాయకుడు వెంకటేష్ తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీల్లో పార్టీ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకుడు వెంకటేష్ హాజరై బోధించారు. ఆదిమ సమాజం నుంచి బానిస సమాజం ఏర్పడిందన్నారు. నూతన సమాజమే ఫ్యూడల్ సమాజమని, ఫ్యూడల్ సమాజంలో రైతులు, కూలీలు పోరాటాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. భూస్వామ్య పెట్టుబడిదారి సమాజం ఏర్పడిందన్నారు. దళిత, గిరిజనులపై దాడులు అధికమయ్యాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరించే విధానాల వల్ల ధరలు విపరీతంగా పెరిగాయని ఆరోపించారు. పెట్టుబడిదారులకు రాయితీలు, పేదలపై నడివిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాలు కేవలం సంక్షేమ పథకాల వరకే పరిమితమయ్యారని ఆరోపించారు. సమస్యల పరిష్కారానికి పెండింగ్‌లో ఉన్న సమస్యల సాధన కోసం సమరశీల పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బందు సాయిలు, దేవేందర్, రాజయ్య, శ్రీకాంత్, ప్రీతి, రమేష్, శేఖర్, మహేందర్, రవికుమార్‌లు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

హన్మకొండ/గణపురం : చిరునవ్వులు..ఆత్మీయ పలకరింపులు..గురువుల సన్మానాలకు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ వేదికైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరులోని విజ్ఞానజ్యోతి విద్యాలయంలో 1998–99 సంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థుల శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత అందరూ ఒకేచోట కలవడంతో ఒకరికొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కొందరు అమెరికాలో సెటిల్ అయ్యామని, మరికొందరు తమ పిల్లలను బాగా చదివిస్తున్నామని, పలువురు సొంత వ్యాపారాలు చేస్తున్నామంటూ వారి జ్ఞాపకాలను పంచుకున్నారు. నాటి గురువులు నర్సింగరావు, దేవేందర్‌రావు, మల్లయ్య, బొజ్జ సురేందర్, చక్రధర్, సుధాకర్, సూర్యనారాయణ, లక్ష్మారెడ్డి, సురేందర్, యాదగిరి (గణపురం మండల కేంద్రంలో ప్రొబెల్ పాఠశాల కరస్పాండెంట్)లను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు.